విఆర్‌ఒలకు 5న సిఎంచే నియామక పత్రాలు : సిఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతనంగా ఎంపికైన ఐదు వేల మంది విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ల (విఆర్‌ఒ)కు ఈ నెల ఐదున ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని మాదాపూర్ హైటెక్స్‌లో నియామక పత్రాలను అందజేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇతర మంత్రులు పాల్గొనే ఈ కార్యక్రమ ఏర్పాట్లపై మంగళవారం బిఆర్.అంబేద్కర్ సచివాలయంలో సంబంధిత అధికారులతో సిఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి ఎంపికైన విఆర్వోలు మధ్యాహ్నం రెండు గంటల లోపు హైటెక్స్ చేరుకునేలా ప్రత్యేకంగా ఆర్‌టిసి బస్సులను ఏర్పాటు చేశామని చెప్పారు. బస్సుల పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణను చేపట్టాలని సైబరాబాద్ కమిషనర్‌ను సిఎస్ ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో రోడ్డు భవనాలు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, ఫైర్ సర్వీస్ డిజి నాగిరెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, తెలంగాణ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి హైడ్రా టోల్ ఫ్రీ నెం.1070

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏడాదికాలంగా ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న హైడ్రా మరో అడుగు ముందుకేసింది. ఇప్పటికే హైడ్రా పోలీస్‌స్టేషన్ అందుబాటులోకి తీసుకొచ్చిన అధికారులు తాజాగా టోల్ ఫ్రీ నెంబర్‌తో పాటు వాట్సప్ ద్వారా ఫిర్యాదు చేసే సౌకర్యం కల్పించారు. ఇకపై హైడ్రాకు సంబంధించి (టోల్ ఫ్రీ) 1070 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయొచ్చు. చెరువులు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ భూములు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జాకు గురైతే టోల్‌ఫ్రీ ద్వారా సమాచారాన్ని అందించొచ్చు. మరీ ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, చెట్లు పడిపోయినా, వరద ముంచెత్తినా, అగ్ని ప్రమాదాలు జరిగినా లేదా ప్రమాదకరమైన పరిస్థితులు నెలకొన్నప్పుడు హైడ్రాకు సంబంధించిన సేవలన్నిటి కోసం టోల్ ఫ్రీ నెంబరు 1070 ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లొచ్చు. దాంతో వెంటనే అధికారులు స్పందించి అన్ని చర్యలు తీసుకునే అవకాశముంది.

వాట్సప్ ద్వారా ఫిర్యాదులు

ఒఆర్ఆర్ పరిధిలో ప్రభుత్వ, ప్రజా ఆస్తుల పరిరక్షణకు 8712406899 నెంబర్‌కు సమాచారం ఇవ్వడంతో పాటు, వాట్సప్ ద్వారా ఫిర్యాదుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు పంపించొచ్చు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, భారీ వర్షాలు పడి కాలనీలు, రహదారులు నీట మునిగినా, అగ్ని ప్రమాదం జరిగినా వెంటనే 8712406901, 9000113667 నెంబర్లకు ఫోన్‌చేసే సౌకర్యాన్ని సైతం కల్పించారు. 1070 టోల్ ఫ్రీ నంబరుతో పాటు మూడు సెల్ నంబర్లను ప్రజలు వినియోగించుకోవచ్చు.

సేవలను సద్వినియోగించుకోవాలి: హైడ్రా కమిషనర్

ఒక మంచి లక్ష్యంతో హైడ్రాను సిఎం ప్రారంభించారని, దాన్ని అందరూ సద్వినియోగించుకోవాలని హైడ్రా కమిషనర్ ఐజి రంగనాథ్ తెలిపారు. రాబోవు తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం, అభివృద్ధి ఫలాలను అందించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అయితే టోల్‌ఫ్రీ, ఇతర నెంబర్లలోనూ ఫిర్యాదులు చేసి అధికారుల దృష్టికి తీసుకురావచ్చన్నారు.

హక్కుల పరిరక్షణకు సుదర్శన్‌రెడ్డి గెలుపు అవసరం

- కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ సంపూర్ణ మద్దతు
- బిఆర్ఎస్ సైతం ఆలోచించి మద్దతు ఇవ్వాలి
- బిజెపి గెలిచినప్పటి నుంచి రాజ్యాంగం, లౌకికతత్వం ధ్వంసం
- కాళేశ్వరం విచారణను సిబిఐకి అప్పగించడం సరికాదు : జాన్‌వెస్లీ

సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ప్రతిపక్షాలు బలపరిచిన ఉపరాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి గెలుపు ఎంతో అవసరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఆయన గెలుపునకు రాష్ట్రంలోని రాజకీయ పక్షాలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. ఇప్పటికే సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ప్రకటించాయని, బిఆర్ఎస్ పార్టీ సైతం ఆలోచించి సుదర్శన్‌రెడ్డికి మద్దతు ప్రకటించాలని కోరారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరి స్మారక కేంద్రంలో మంగళవారం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. దేశంలో బిజెపి అధికారం చేపట్టిన నాటి నుంచి రాజ్యాంగ హక్కులను, లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థలను దెబ్బతీస్తోందని విమర్శించారు. ఎన్నికల కమిషన్‌ను సైతం తన జేబు సంస్థగా మార్చుకుందన్నారు. తన అనుకూల ఓట్లను చేర్పిస్తూ, ప్రతిపక్షాల ఓట్లను తొలగించే కుట్ర పన్నుతోందని తెలిపారు.

నియంతృత్వ విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. ఈ తరుణంలో దేశంలో ఉపరాష్ట్రపతి ఎన్నికలు తెరమీదకి వచ్చాయని చెప్పారు. భారత రాజ్యాంగాన్ని, హక్కులను పరిరక్షించుకునేందుకు ప్రతిపక్షాలు బలపరిచిన ఉపరాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సుదర్శన్ రెడ్డికి మెజార్టీ తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ రాష్ట్రంపై ఉందన్నారు.

కాళేశ్వరం విషయంలో అసెంబ్లీ తీర్మానం చేసిన కేసును సిబిఐకి అప్పగించిందని తెలిపారు. అయితే, కేంద్ర ప్రభుత్వం చేతిలో సిబిఐ అనుకూల సంస్థగా మారిన తరుణంలో కాళేశ్వరం నివేదికపై తేలుస్తుందన్న నమ్మకం లేదన్నారు. రాష్ట్ర సంస్థతోనే కాళేశ్వరం కేసును విచారణ చేపట్టాలని ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడటానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలే కారణమని విమర్శించారు. ఇంకా రాష్ట్రానికి నాలుగున్నర లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉందన్నారు. యూరియా కోసం రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం చేస్తున్న ఆందోళనలకు సిపిఎం మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని శాసనసభ మరోసారి చేసిన తీర్మానానికి గవర్నర్ ఆమోదముద్ర తెలపాలని కోరారు.

రామోజీ ఫిలింసిటీలో పేదలకు ఇండ్ల స్థలాల విషయంలో అధికారులు, ప్రభుత్వం చేసిన వాగ్దానాన్ని నిలుపుకోవాలని కోరారు. అనాజ్‌పూర్ రైతాంగ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, రాష్ట్ర ప్రభుత్వం ఆ రైతుల సమస్యను పరిష్కరించాలని కోరారు. అనాజ్‌పూర్ రైతులకు పట్టాలు జారీ చేయాలన్నారు. చౌదర్‌పల్లిలో స్వయం సహాయక సంఘాలలో జరిగిన అవినీతిపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఈ నెల ఒకటి నుంచి 17 వరకు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని హిందూ, ముస్లిం మధ్య ఘర్షణగా సృష్టించే ప్రయత్నం చేస్తోందని, దీన్ని తిప్పుకొట్టాలని సూచించారు. ఆ పోరాట స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే స్థానాలపై దృష్టి కేంద్రీకరించాలని కార్యకర్తలకు సూచించారు.

12న సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ

సిపిఎం మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని ఈ నెల 12న గ్రామ గ్రామాన నిర్వహించాలని జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సామెల్, నర్సింహ, కవిత, చంద్రమోహన్, డి.జగదీష్, జిల్లా కమిటీ సభ్యులు సి.శోభన్, పి.అంజయ్య, రావుల జంగయ్య, జె.రుద్ర కుమార్, సిహెచ్. బుగ్గరములు, కీసరి నర్సిరెడ్డి, కె.సుమలత, డి.కిషన్, పి.జగన్ పాల్గొన్నారు.

రాష్ట్రానికి చేరిన తొమ్మిది వేల మెట్రిక్ టన్నుల యూరియా

- రానున్న మరో ఐదువేల మెట్రిక్ టన్నులు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర రైతాంగానికి యూరియా కొరత తీరబోతున్నదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రానికి తొమ్మిది వేల మెట్రిక్ టన్నుల యూరియా చేరిందని వెల్లడించారు. మరో ఐదువేల మెట్రిక్ టన్నులు బుధవారం రోజు తెలంగాణకు చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మరో వారం రోజుల్లో 27,470 మెట్రిక్ టన్నుల యూరియా హైదరాబాద్‌కు చేరుతోందని మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైతులకు యూరియా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటల నష్టాన్ని ఐదురోజుల్లో సర్వే చేసి పూర్తి నివేదిక ఇవ్వాలని సూచించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎరువుల సరఫరా విషయంలో అన్ని రకాల చర్యలను తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచేందుకు ఎప్పటికప్పుడు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిపారు. సనత్‌నగర్, వరంగల్, జడ్చర్ల, నాగిరెడ్డిపల్లి, మిర్యాలగూడ, కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాలకు రైల్వే రేక్ పాయింట్ల నుంచి యూరియా సరఫరా అయిందని పేర్కొన్నారు. వచ్చే వారం రోజుల్లో కరాయికల్, గంగవరం, దామ్ర పోర్టుల ద్వారా మరో 27,470 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి చేరనుందని తెలిపారు. ఎరువుల కొరత ఉండకుండా రైతులకు అవసరమైన చోట తక్షణమే అందేలా సమన్వయం చేయాలని కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.

అదేవిధంగా ఇటీవల వర్షాల కారణంగా జరిగిన పంట నష్టానికి పరిహారం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఎటువంటి అన్యాయం జరగకుండా, సకాలంలో సహాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. అందుకోసం పంట నష్టం సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. రైతుల సంక్షేమం, వారి పంటల రక్షణ రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి పునరుద్ఘాటించారు.

నేడు ఢిల్లీకి భట్టి విక్రమార్క, తుమ్మల

భారీ వర్షాల కారణంగా జరిగిన ఆస్తినష్టం, రైతులకు యూరియా కొరత తదితర సమస్యలపై కేంద్ర మంత్రులతో చర్చించేందుకు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఢిల్లీకి బయలుదేరనున్నారు. ఇతర వ్యవసాయ, ఉద్యాన సమస్యలపై సంబంధిత మంత్రులను కలవనున్నారు.

'జూబ్లీహిల్స్' ఓటరు ముసాయిదా జాబితా విడుదల

- నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 3,92,669
- సెప్టెంబర్ 17 వరకు అభ్యంతరాల స్వీకరణ
- 30న తుది జాబితా విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఓటరు ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. జూబ్లిహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ముసాయిదా ఓటర్ల జాబితాను భారత ఎన్నికల సంఘం మంగళవారం ప్రచురించింది. జాబితాను అధికారులు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ ప్రచురించారు. కొత్త ఓటర్ల నమోదుతోపాటు మార్పులు, చేర్పులు చేపట్టేందుకు వెసులుబాటు కల్పించారు. సెప్టెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం జూబ్లిహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో 139 లొకేషన్‌లు.. 407 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 3,92,669 మంది ఓటర్లున్నారు. పురుష ఓటర్లు 2,04,288 మంది కాగా, మహిళా ఓటర్లు 1,88,356 మంది, ఇతరులు 25 మంది ఉన్నారు.

సెప్టెంబర్ 17 వరకు అభ్యంతరాల స్వీకరణ

నియోజకవర్గానికి చెందిన డ్రాఫ్ట్ ఫొటో ఓటర్ల జాబితా కాపీని సంబంధిత 'ఇఆర్‌ఒ' కార్యాలయంలో, పోలింగ్ స్టేషన్‌లలో అందుబాటులో ఉంచారు. ఓటర్లు తమ పేర్లను ధ్రువీకరించుకోవడానికి వీలుగా 'సిఇఒ' వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చు. ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లను సరిచూసుకోవాలి. అభ్యంతరాలు ఏవైనా ఉంటే, ఫారం-6, ఫారం-7, ఫారం-8లో సమర్పించాలి. ఓటర్ల జాబితాపై ఈ నెల రెండు నుంచి 17 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. జులై ఒకటో తేదీ నాటికి 18వ ఏళ్ల వయస్సు నిండిన వారందరూ సెప్టెంబర్ 17లోగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో సైతం ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. అంతేకాకుండా ఓటర్ల జాబితాలో తప్పుల సవరణ, మార్పులు, చేర్పులు, మృతుల పేర్ల తొలగింపు, పోలింగ్ కేంద్రాలు, నియోజకవర్గాల మార్పు చేసుకోవాలనుకునే వారు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. సెప్టెంబర్ 25 వరకు ఫిర్యాదులు, అర్జీలు పరిష్కారించి, సెప్టెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నారు.

క్రీడా హబ్‌గా తెలంగాణ

- మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

క్రీడా హబ్‌గా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామని ఐటీ శాఖ మంత్రి, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు పరిధిలో గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ నిర్వహిస్తున్న 79వ యోనెక్స్ సన్‌రైజ్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. చాంపియన్‌షిప్ సౌత్ జోన్‌లో ఉన్న అగ్రశ్రేణి క్రీడాకారులందరినీ ఒకచోట కలిసేలా చేస్తుందని అన్నారు. గోపిచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో అద్భుతమైన మౌలిక సదుపాయాలు ఉండడమే కాకుండా, క్రీడా స్ఫూర్తిని పెంచే సానుకూల, ప్రశాంతమైన వాతావరణం ఉందని తెలిపారు. ఈ స్థాయిలో క్రీడా కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఇదే సరైన ప్రదేశమన్నారు. తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోపీచంద్ మాట్లాడుతూ.. గోపీచంద్ అకాడమీ క్రీడాకారులు అత్యుత్తమ బ్యాడ్మింటన్ చాంపియన్లుగా ఎదగడానికి సరైన శిక్షణ ఇస్తుందని తెలిపారు. ఈ చాంపియన్‌షిప్ వల్ల ఎంతోమంది క్రీడాకారుల్లోని నైపుణ్యం వెలుగులోకి వస్తుందని చెప్పారు. శ్రీ రామచంద్ర మిషన్ అధ్యక్షులు పూజ్య దాజి మాట్లాడుతూ.. 79వ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. క్రీడల ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకుంటాం కాబట్టి.. వాటిని ఒక వృత్తిలా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ధ్యానంతో కలిసి సాధన చేస్తే శారీరక దృఢత్వంతో పాటు, జీవితంలోని పరిస్థితులను ఎదుర్కోవడంలో అపారమైన శక్తిని ఇస్తుందని చెప్పారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగస్వాములు కండి

- మానవీయకోణంలో చేపట్టిన సంక్షేమ పథకమిది
- సిమెంట్, స్టీలు పరిశ్రమల యజమానులకు భట్టి వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వం మానవీయకోణంలో, ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో రాష్ట్రంలోని సిమెంట్, స్టీలు పరిశ్రమలు భాగస్వాములు కావాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి సిమెంట్, స్టీలు పరిశ్రమల యజమానులు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. వాటి నిర్మాణానికి ధరలు తగ్గించి నాణ్యమైన సిమెంట్, స్టీలును అందించాలని పరిశ్రమల యజమానుకు విజ్ఞప్తి చేశారు. "పేద కుటుంబాలకు సంబంధించిన సంక్షేమ పథకం కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అమలవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పరిశ్రమలు హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. భవిష్యత్‌లో సిమెంట్, స్టీలు ఉత్పత్తులకు భారీ డిమాండ్ ఏర్పడుతుంది, ఈ క్రమంలో పెద్ద, చిన్న అనే అంతరం లేకుండా కంపెనీలన్నీ ఒకే ధరకు సిమెంటు, స్టీలు సరఫరా చేయండి" అని వారికి మంత్రులు సూచించారు. పక్క రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడుల్లో ప్రభుత్వ పథకాలకు సిమెంట్ కంపెనీలు అందిస్తున్న ధరను సమావేశంలో వారు సమీక్షించారు. 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సుమారు 50 లక్షల మెట్రిక్ టన్నుల సిమెంట్, 27.75 లక్షల మెట్రిక్ టన్నుల స్టీలు అవసరం అవుతుందని అధికారులు పరిశ్రమల యజమానులకు వివరించారు. పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన సామాగ్రిని సరఫరా చేసే అంశంపై త్వరలో సమావేశమై తుది ధరలు ఖరారు చేస్తామని కంపెనీల ప్రతినిధులు తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

- ఎమ్మెల్యేలు రామారావు పటేల్, డాక్టర్ హరీశ్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ సర్పంచులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయిపడ్డ రూ.670 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని బిజెపి ఎమ్మెల్యేలు రామారావు పటేల్, డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్ లో తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో జెఎసి బృందం ఎమ్మెల్యేలకు వినతిపత్రాన్ని అందజేశారు. తాము ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా రామారావు పటేల్, డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ...ప్రభుత్వమనేది నిరంతర ప్రక్రియ అని, మాజీ సర్పంచులకు పార్టీలను ఆపాదించడం అన్యాయమని తెలిపారు. సర్పంచులెవరైనా బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులకు కూడా రాష్ట్ర సర్కారు రూ.150 కోట్ల విలువైన పనులు చేయించి బిల్లులు ఇవ్వకపోవడం దారుణమని విమర్శించారు. 22 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, 15వ ఫైనాన్స్ కార్పొరేషన్, ఎస్‌డిఎఫ్ నిధులను నిలిపేసిందని ఎత్తిచూపారు. పంచాయతీల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా కొనలేని పరిస్థితి దాపురించిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్ని కోలుకోలేని విధంగా దెబ్బ తీసిందని ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెడతారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి కార్యదర్శి వేడబోయిన గణేష్, బీరప్ప, మన్నె పద్మారెడ్డి పూర్ణచందర్ గౌడ్, అరవింద్ రెడ్డి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆరోగ్య పథకానికి పచ్చజెండా

- ఉప ముఖ్యమంత్రి భట్టి హామీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని మంత్రివర్గ ఉపసంఘం చైర్మెన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉద్యోగ జెఎసి నేతలకు హామీ ఇచ్చారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఇహెచ్‌ఎస్)కి సంబంధించి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. నగదు రహిత వైద్యం అందించడం కోసం హెల్త్‌కేర్ ట్రస్టును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. ఇహెచ్‌ఎస్ విధివిధానాల రూపకల్పన కోసం ఈనెల 8న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్)తో సమావేశం ఉంటుందని భట్టి విక్రమార్క వివరించారు. పెండింగ్ బిల్లుల చెల్లింపునకు సంబంధించి నెలకు రూ.700 కోట్లు తప్పనిసరిగా విడుదల చేస్తామని ప్రకటించారు. ఆర్థిక పరిస్థితి బాగుంటే నెలకు రూ.750 కోట్లు చెల్లిస్తామని తెలిపారు. త్వరలోనే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో స్థానికత కోల్పోయిన 317 జీవో బాధితులకు డిప్యూటేషన్లు కల్పిస్తామన్నారు. ఆరు నెలల తర్వాత మరో డిఎ చెల్లిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఐఎఎస్ అధికారులు నవీన్ మిట్టల్, సందీప్‌కుమార్ సుల్తానియా, బిఎమ్‌డి ఎక్కా, లోకేశ్‌కుమార్, క్రిస్టినా జెడ్ చోంగ్తు, రఘునందన్‌రావు, కృష్ణభాస్కర్, ఉద్యోగ జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, అడిషనల్ సెక్రెటరీ జనరల్ పుల్గం దామోదర్‌రెడ్డి, కోచైర్మెన్ చావ రవి, జి.సదానందంగౌడ్, వంగ రవీందర్‌రెడ్డి, పి.మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినందుకే ఉద్యమ కార్యాచరణను వాయిదా వేస్తున్నామని ఉద్యోగ జెఎసి చైర్మెన్ మారం జగదీశ్వర్ చెప్పారు. కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్లలో క్యాడర్ స్ట్రెంత్‌ను పెంచుతామంటూ మంత్రివర్గ ఉపసంఘం హామీ ఇచ్చిందని ఉద్యోగ జేఏసీ సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. వివిధ శాఖల్లో కారుణ్య నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్య 25 ఏళ్లుగా పరిష్కారం కాలేదని, వెంటనే పరిష్కారం చేయాలని ఉద్యోగ జెఎసి అడిషనల్ సెక్రెటరీ జనరల్ పుల్గం దామోదర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

ప్రజా పోరాట యోధుడు సురవరం సుధాకర్‌రెడ్డి

- ఉద్యమాలే ఊపిరిగా జీవితం
- సంస్మరణ సభలో పలువురు వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిత్య అధ్యయన శీలుడు, మార్క్సిస్ట్ ఉపాధ్యాయులు, ప్రజా పోరాట యోధులు సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అని పలువురు వక్తలు కొనియాడారు. కమ్యూనిస్టులంతా ఐక్యం కావాలని కోరుకుంటున్న తరుణంలో సురవరం భౌతికంగా దూరం కావడం దురదృష్టకరమన్నారు. తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో మంగళవారం సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభకు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రజా సమస్యలతో మమేకమై ఉద్యమాలను నిర్మించిన అగ్రగణ్యులు సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆయన లేని లోటు కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిదన్నారు. మీడియా అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ ఫాసిస్టు ధోరణులను ముందే పసిగట్టిన నాయకులు సుధాకర్‌రెడ్డి అన్నారు. విద్యార్థి నేతగా మొదలైన ఆయన జీవితం.. సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదిగారని కొనియాడారు. రావి నారాయణరెడ్డి ఆడిటోరియం ప్రాంగణంలో సుధాకర్‌రెడ్డి పేరుతో స్మారక హాల్ ఏర్పాటు చేయాలని, ఇందుకు ట్రస్ట్ సభ్యులు చర్యలు తీసుకోవాలని కోరారు.ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ చివరి క్షణం వరకు ఉద్యమాలే ఊపిరిగా జీవించిన గొప్ప నాయకుడు సుధాకర్‌రెడ్డి అని చెప్పారు. ఎంపిగా నల్లగొండ జిల్లాకు కృష్ణా జలాల తరలింపు ద్వారా ఫ్లోరైడ్ సమస్య పరిష్కరించడానికి కృషి చేశారన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం మాజీ విసి ఎస్.వి.సత్యనారాయణ మాట్లాడుతూ సుధాకర్‌రెడ్డి సద్గుణాల్లో కొన్నైనా అలవర్చుకుని ఆచరించడం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. తెలంగాణ రచయిత సంఘం కార్యదర్శి నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ.. ఈ కల్లోల సమాజంలో మన కలలను చరితార్థం చేసిన కల్లోల మేఘం సురవరం అని అన్నారు.

రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి తన తొలి రాజకీయ గురువు అని తెలిపారు. ఆర్థిక పోరాటాలను వర్గ పోరాటాలుగా మార్చడం, పార్టీ బలోపేతానికి కృషి చేయడం ద్వారా ఆయన ఆశయం నెరవేర్చాల్సిన అవసరముందన్నారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసుఫ్ మాట్లాడుతూ తాను ఈ స్థాయికి ఎదగడానికి సురవరం సుధాకర్‌రెడ్డి స్ఫూర్తి అని తెలిపారు. సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ సుధాకర్‌రెడ్డి మరణం విప్లవోద్యమానికి తీరని లోటన్నారు. శ్రామిక మహిళా ఫోరం అధ్యక్షులు ప్రేం పావని మాట్లాడుతూ మహిళా నేతల రక్షణకు ఆయన అనునిత్యం ఆలోచించేవారిని గుర్తు చేసుకున్నారు. సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి మాట్లాడుతూ ఆయన పేరుతో ప్రతి ఏటా స్మారకోపాన్యాసం, అవార్డు అందజేయడం సముచితంగా ఉంటుందన్నారు. సీనియర్ జర్నలిస్టు మల్లెపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ.. ఏ పనైనా ప్రజాస్వామికంగానే కాకుండా మనస్ఫూర్తితో చేసే గొప్ప నాయకుడు సురవరం అని కొనియాడారు. ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఆయనను కోల్పోవడం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని, దానిని సుధాకర్‌రెడ్డి సతీమణి విజయలక్ష్మి కొంత తీర్చాలని కోరారు. కోశాధికారి ఉజ్జిని రత్నాకర్ రావు మాట్లాడుతూ.. సురవరం తెలంగాణ అమరవీరుల సార్మక ట్రస్ట్ అధ్యక్షులుగా ట్రస్ట్ ఏర్పాటుతోపాటు నిర్వహణకు ఎనలేని కృషి చేశారన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి సతీమణి విజయలక్ష్మి మాట్లాడుతూ సుధాకర్‌రెడ్డి పట్ల పార్టీ, ప్రభుత్వం చూపిన ప్రేమ ఎప్పటికీ మర్చిపోలేనిదన్నారు. తమ కోరిక మేరకు సురవరం సుధాకర్‌రెడ్డి స్వగ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి, పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని విధులు విడుదల చేసినందుకు సిఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, రిటైర్డ్ జడ్జి కాంతయ్య, వ్యవసాయ శాస్త్రవేత్త అప్పారావు, రావి ప్రతిభా, శ్రీనివాస్ నాయుడు, టి.సురేశ్ పాల్గొన్నారు.

సిఎం ప్రజావాణికి బ్యాటరీ వాహనం

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

సిఎం ప్రజావాణిలో అర్జీలు పెట్టుకునేందుకు వచ్చే వృద్ధులు, వికలాంగుల సౌకర్యార్థం కోసం బ్యాటరీ వాహనాన్ని ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్యదేవరాజన్ మంగళవారం ప్రజాభవన్‌లో ప్రారంభించారు. ప్రజాభవన్ ప్రధాన ద్వారం నుంచి అర్జీలు స్వీకరించే కార్యాలయం వరకు వృద్ధులు, వికలాంగులను ఉచితంగా ఆ వాహనం ద్వారా తీసుకెళ్లనున్నారు.

ఎన్‌డిఎస్ఎ రిపోర్టుతోనే సిబిఐ దర్యాప్తు

- హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర సర్కారు
- అక్టోబర్ ఏడో తేదీకి విచారణ వాయిదా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీ (ఎన్‌డిఎస్ఎ) నివేదిక ఆధారంగానే కాళేశ్వరం అవకతవకలపై దర్యాప్తు జరుగుతుందని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నివేదిక సిఫారసులకు అనుగుణంగా దర్యాప్తు ఉండదనీ కెసిఆర్, హరీశ్‌రావుపై చర్యలు కూడా తీసుకోబోమని హామీనిచ్చింది. ప్రభుత్వ హామీలను రికార్డు చేసిన హైకోర్టు అందుకు అనుగుణంగా మధ్యంతర ఉత్తర్వులను వెలువరించింది. కమిషన్ రిపోర్టు ఆధారంగా పిటిషనర్లపై చర్యలు తీసుకోరాదనీ, కమిషన్ రిపోర్టు ఆధారంగా సిబిఐ దర్యాప్తు చేయరాదని, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ రిపోర్టు ఆధారంగా ముందుకెళ్లాలని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, పర్యవేక్షణ తదితరాలపై జాతీయ ప్రాజెక్టు భద్రతా మండలి (ఎన్‌డిఎస్ఏ) రాష్ట్రానికి ఇచ్చిన మధ్యంతర, తుది నివేదికల ఆధారంగా విచారణకు అనుమతిచ్చింది. పీసీ.ఘోష్ కమిషన్ రిపోర్టుపై మాజీ సిఎం, బిఆర్ఎస్ అధ్యక్షులు కె.చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు వేర్వేరుగా వేసిన మధ్యంతర పిటిషన్లతోపాటు.. జీవో 6 ద్వారా ఏర్పాటైన జస్టిస్ ఘోష్ కమిషన్‌ను సవాల్ చేసిన ప్రధాన పిటిషన్లపై విచారణను అక్టోబర్ ఏడో తేదీకి వాయిదా వేసింది. అప్పటిలోగా ప్రభుత్వం కౌంటర్లు దాఖలు చేయాలని నోటీసులిస్తూ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఏకే.సింగ్, జస్టిస్ జీఎం. మొహియుద్దీన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఆదేశించింది.

విద్యార్థుల గోస పట్టించుకోరా

- ఆరు నెలలుగా ఆందోళనలు చేస్తున్నా సిఎంకు వినిపించదా ?
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 'మంత్రుల నివాసాల ముట్టడి'
- విద్యార్థి నాయకుల అరెస్టులు.. పలువురికి గాయాలు
- అరెస్టులను ఖండిస్తున్నాం : నాగరాజు
- నేడు రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు

ఆందోళనకారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గడిచిన ఆరేళ్ల నుంచి సుమారు రూ.8,158 కోట్ల పెండింగ్ ఫీజు బకాయిలు ఉన్నాయని, వాటిని సర్కారు విడుదల చేయడం లేదని ఎస్ఎఫ్ఐ ఆగ్రహం వ్యక్తం చేసింది. పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ రాష్ట్రవ్యాప్త ధర్నా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం హైదరాబాద్‌లో 'మంత్రుల నివాసాల ముట్టడి' చేపట్టారు. తమ సమస్యలను మంత్రులకు విన్నవించేందుకు వెళ్తున్న విద్యార్థి నేతలను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా తీవ్ర తోపులాట జరిగింది. విద్యార్థి నాయకులు తీవ్రంగా గాయపడగా.. పలువురి చొక్కాలను చింపి పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రజనీకాంత్ మాట్లాడుతూ.. ఫీజుల బకాయి నిధులు విడుదల చేయకపోవడం వల్ల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికేట్స్ ఇవ్వడం లేదని, దీనివల్ల పై చదువులకు వెళ్లలేక పోతున్నారని తెలిపారు. రాష్ట్రంలో తొమ్మిది నెలలుగా గురుకులాలు, కెజిబివిలు, ఆశ్రమ పాఠశాలల్లో మెస్, కాస్మోటిక్ చార్జీలు పెండింగ్ ఉన్నాయని, వాటిని కూడా విడుదల చేయడం లేదని అన్నారు. కెజిబివిలు, ఎస్‌సి గురుకులాల్లో యూనిఫామ్, టెక్ట్స్ బుక్స్ పూర్తిస్థాయిలో అందించలేదన్నారు. పుస్తకాలు లేకుండా పాఠాలు ఎలా చదువుకుంటారని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేరని, విద్యార్థులు చనిపోయినా, సమస్యలు వచ్చినా కనీసం విద్యారంగాన్ని పట్టించుకునే నాథుడే లేరన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలు, యూనివర్సిటీల నిధుల బకాయిలు, పాఠశాల అభివృద్ధి కోసం 'మన ఊరు మనబడి' బకాయిలు ఇలా సమస్తం పెండింగ్‌లోనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని యాజమాన్యాలు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయకుండా చూడాలని, ప్రత్యేక జిఒ తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులపై పోలీసులు కర్కశంగా వ్యవహరించారు. చొక్కాలను చింపేశారు. అనంతరం అరెస్టు చేసి బొల్లారం, కార్ఖానా, బోయినపల్లి, తిరుమలగిరి పోలీసు స్టేషన్లకు వారిని తరలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి కిరణ్, కె అశోక్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు కార్తీక్, లెనిన్ గువేరా, అవినాష్, జె రమేష్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కెవై ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాల్లోనూ..

మంచిర్యాల జిల్లా కేంద్రంలో బస్టాండ్ నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో విద్యార్థులు భారీ నిరసన ప్రదర్శనగా వెళ్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. భువనగిరి జిల్లా కేంద్రంలో చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. ఈ సమయంలో విద్యార్థులకు పోలీసుల మధ్య తోపులాట జరిగింది. అడ్మినిస్ట్రేటివ్ అధికారి జగన్ మోహన్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. జయశంకర్- భూపాలపల్లి జిల్లాలోని జాతీయ రహదారిపై విద్యార్థులు బైటాయించి పెద్దఎత్తున ధర్నా చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులను పోలీసులు అరెస్టు చేసి సుబేదారి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు.

సంగారెడ్డిలో కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద బైటాయించారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకి వినతిపత్రం అందజేశారు. మెదక్ పట్టణంలో విద్యార్థులు ర్యాలీ, సిద్దిపేట పట్టణంలో పాత బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో విద్యార్థులు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించి.. ధర్నా చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు బైటాయించి నిరసన తెలిపారు. కలెక్టరేట్‌లో ఏఓకు వినతిపత్రం అందించారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో విద్యార్థులు ర్యాలీగా వచ్చి సత్యనారాయణ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు.

ఫీజులు అడిగితే దాడులు చేస్తారా?
ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు

రాష్ట్రంలో ఫీజుల బకాయిలు విడుదల చేయాలని ఆందోళన చేస్తున్న విద్యార్థులు పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించి, దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, విద్యార్థులు ఖండించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి నాగరాజు ఒక ప్రకటనలో కోరారు. అరెస్టులకు నిరసనగా బుధవారం రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపు నిచ్చారు. "ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రజనీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్, అశోక్, నాయకులు కార్తీక్, ప్రణయ్, లెనిన్, అవినాష్, శ్రీకాంత్ తదితరులను అరెస్టు చేశారు. అశోక్‌రెడ్డి చొక్కా చించేశారు. శ్రీకాంత్ కాలికి రక్తం వచ్చేలాగా గాయాలు చేశారు. విద్యార్థులను రౌడిల్లా ఈడ్చుకుంటూ వెళ్లి పోలీసు వ్యాన్లలో వేశారు. హన్మకొండ, సిరిసిల్ల జిల్లాల్లో అక్రమంగా అరెస్టు చేశారు. కనీసం సమస్యలు చెప్పుకోకుండా పోలీసులు నిర్బంధం ప్రయోగిస్తున్నారు" అని పేర్కొన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని ప్రకటనలో హెచ్చరించారు.

మాట్లాడుతున్న విసి సజ్జనార్

ఐటి కారిడార్‌లో 275 నూతన ఎలక్ట్రిక్ బస్సులు

- ఆయా సంస్థలకు అద్దెకిచ్చే యోచన
- ఐటి సంస్థల ప్రతినిధులతో సజ్జనార్ సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

హైదరాబాద్ ఐటి కారిడార్‌లో నూతనంగా 275 ఎలక్ట్రిక్ బస్సుల్ని త్వరలో ప్రవేశపెడుతున్నట్టు టిజిఎస్‌ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ విసి సజ్జనార్ తెలిపారు. ఈ బస్సుల్ని ఆయా ఐటి కంపెనీలకు లీజుకు ఇస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న కంపెనీలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఐటి కారిడార్‌లో ప్రస్తుతం 200 ఎలక్ట్రిక్ బస్సులు సేవలందిస్తున్నాయని, వాటికి అదనంగా త్వరలో మరో 275 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకువస్తున్నామని వివరించారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి), అసోసియేటేడ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచామ్), తెలంగాణ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ (టిఎఫ్ఎంసి) సంయుక్తంగా టెక్ మహీంద్రా క్యాంపస్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాయి. దీనికాయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు ఐటి కంపెనీలకు ఎలక్ట్రిక్ బస్సులతో పాటు మెట్రో డీలక్స్ బస్సుల్ని అద్దెకు ఇచ్చే సదుపాయాన్ని కల్పించామని తెలిపారు. ఐటి సంస్థలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రయివేటు వాహనాల వినియోగం వల్ల ఐటి కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయనీ, దీని నివారణకు ప్రజా రవాణాను మెరుగుపర్చడమే పరిష్కారమని వివరించారు. ఐటి సంస్థలు ఆ మేరకు ఉద్యోగులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించుకునే ఉద్యోగులకు ప్రోత్సహకాలు ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలించాలని చెప్పారు. ఈ సందర్భంగా ఐటి కారిడార్‌లో అందిస్తున్న రవాణా సేవలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆర్‌టిసి ఉన్నతాధికారులు వివరించారు. ఐటి సంస్థల ప్రతినిధులు కూడా పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. వాటిని కూడా పరిగణనలోకి తీసుకుంటామని ఆర్‌టిసి ఉన్నతాధికారులు చెప్పారు. సమావేశంలో అసోచామ్ దక్షిణ ప్రాంత సెక్టార్ కో చైర్మెన్, వర్చుసా వైస్ ప్రెసిడెంట్ కృష్ణ ఏదుల, టిఎఫ్ఎంసి ప్రెసిడెంట్ సత్యనారాయణ మదాల, టెక్ మహీంద్రా హెచ్‌ఆర్‌డి వినయ్ అగర్వాల్, ఆర్‌టిసి ఇడిలు మునిశేఖర్, రాజశేఖర్, సిటిఎం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

4న కమిషనర్ కార్యాలయం ముందు ఎఎన్ఎంల ధర్నా

- టియుఎంహెచ్ఇయు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైద్యారోగ్యశాఖలో వివిధ పేర్లతో పని చేస్తున్న ఏఎన్ఎంలందరి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 4న హైదరాబాద్‌లో కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి ఫసియుద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదనాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఏకకాలంలో అనేక టార్గెట్స్ కేటాయించి, వివిధ యాప్ ల పేరుతో ఆఫ్‌లైన్‌లో, ఆన్‌లైన్‌లో 100 శాతం టార్గెట్స్ పూర్తి చేయాలనీ, ప్రతి వారం ఏఎన్ఎంలకు కేటాయించిన టార్గెట్స్ వాట్సాప్ గ్రూపులలో షేర్ చేసి మానసికంగా వేధిస్తున్నారని వారు విమర్శించారు. దీంతో ఏఎన్ఎంలు పని ఒత్తిడితో తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి రావాల్సిన పెండింగ్ బిల్లులు, స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు, కాంట్రాక్టులో ఉన్నవారిని రెగ్యులర్ చేయడంలో మాత్రం ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న ధర్నాకు ఏఎన్ఎంలందరు రావాలని వారు పిలుపునిచ్చారు.

త్వరలో ఆరువేల వైద్య పోస్టులు

- నాణ్యమైన వైద్యం అందించడంలో రాజీ లేదు
- వైద్య కళాశాలల్లో సౌకర్యాల కల్పనకు సిఎం ఆదేశం
- మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంలో రాజీ పడేది లేదని, వైద్య ఆరోగ్యశాఖలో త్వరలో ఆరు వేల పోస్టులకు నోటిఫికేషన్ వేసేందుకు ప్రభుత్వం సిద్ధమైందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఇప్పటికే ఎనిమిది వేల పోస్టులు భర్తీ చేసినట్టు చెప్పారు. అలాగే, వైద్య కళాశాలల్లో సౌకర్యాలు కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించినట్టు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం మెడికల్, నర్సింగ్ కాలేజీలు, 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్, బాలికలు, బాలుర హాస్టల్‌ను ప్రారంభించారు. అనంతరం మంత్రి దామోదర విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక చేపట్టిందని చెప్పారు. అన్ని వైద్య కళాశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. నర్సింగ్ కాలేజీల ద్వారా విద్యార్థులకు ఉపాధి కోసం ఇతర దేశాల భాషలపై నైపుణ్యత కల్పించడం కోసం వినూత్న కార్యక్రమం చేపడుతున్నామన్నారు. తద్వారా ఆర్థికంగా స్థిరపడతారని అన్నారు. అవయవాల మార్పిడి ద్వారా ఈస్టర్న్ తెలంగాణ హబ్‌గా మారాలని చెప్పారు. జిల్లా కేంద్రంలో క్యాన్సర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

హాస్టల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

రెవెన్యూ, హౌసింగ్, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్య, వైద్యం రంగాల అభివృద్ధి కోసం పకడ్బందీ ప్రణాళికతో ముందుకెళ్తోందని చెప్పారు. జిల్లాకు 18 టన్నుల యూరియా వస్తుందని, ప్రతి రైతుకూ ఇబ్బంది లేకుండా అందజేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. కేంద్రంతో చర్చలు జరిపి మరింత యూరియా కోటాను సాధించడం కోసం మంత్రివర్గం ఢిల్లీకి వెళ్లనుందని చెప్పారు. పంచాయతీరాజ్, దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ఆరోగ్యం బాగుంటేనే ఏదైనా చేయగలమని, అందుకోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని వైద్యశాఖ బలోపేతానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఎంజిఎం ఆస్పత్రిలో వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహబూబాబాద్ జిల్లా గిరిజన ప్రాంతం కాబట్టి అధిక నిధులు కేటాయించి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జిల్లా అభివృద్ధికి సహకరించాలని ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళినాయక్ మంత్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్‌పి సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో (రెవెన్యూ) కె అనిల్ కుమార్, డిఎంఈ డాక్టర్ కె నరేంద్ర కుమార్, ఎన్ఎంసి రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ విమల తమస్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లకావత్ వెంకట్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రుల కాన్వాయ్ ముందు బిఆర్ఎస్ నిరసన

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తోందంటూ బిఆర్ఎస్ నాయకులు మంత్రుల కాన్వాయ్‌ని అడ్డుకునేందుకు యత్నించారు. కురవి మండల కేంద్రంలో జాతీయ రహదారిపై భారీ రాస్తారోకో నిర్వహించారు. డిఎస్‌పి తిరుపతి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులను పక్కకు నెట్టేశారు.

టెక్ మహీంద్రాతో కేర్ హాస్పిటల్స్ భాగస్వామ్యం

24/7 కాల్ సెంటర్ ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ వైద్య సేవల సంస్థ కేర్ హాస్పిటల్స్ ఐటి కంపెనీ టెక్ మహీంద్రాతో భాగస్వామ్యంతో కుదుర్చుకున్నట్లు తెలిపింది. దీంతో 24/7 బహుభాషా కాల్ సెంటర్‌ను ప్రారంభించినట్లు పేర్కొంది. ఈ సౌకర్యం రోగులకు తమ సేవలను అందుబాటును మెరుగుపరచడానికి, సేవలను బలోపేతం చేయడానికి, ఖర్చు తక్కువ, అందుబాటులో ఉన్న నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను అందించడానికి రూపొందించబడిందని ఆసంస్థ పేర్కొంది. దీని ప్రారంభ కార్యక్రమంలో కేర్ హాస్పిటల్స్ సీనియర్ అధికారులు శాలభ్ దంగ్, వినోద్ రామన్, విజయ్ సేతి, రజీవ్ చౌరే, శశికాంత్ అగ్గసరే, నవీన్ నారాయణన్ సిమ్రాన్ కౌర్ సేతి పాల్గొనగా.. టెక్ మహీంద్రా నుంచి సంజయ్ ఘురా, కృష్ణన్ కవిక్కల్, కార్తిక్‌లు హాజరయ్యారు.

లింక్ రోడ్ల నిర్మాణానికి రూ. 700 కోట్లు

- గిరిజన ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గిరిజన ప్రాంతాల్లోని 429 గిరిజన ఆవాసాలను కలిపే లింక్ రోడ్ల నిర్మాణం కోసం రూ.700 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. గిరిజన తండాలకు సంబంధించిన రోడ్ల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో ఉందని చెప్పారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పలు జిల్లాల్లో రోడ్లు దెబ్బతిన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో జిఒ 240 ప్రకారం నిధులు మంజూరు చేసినట్టు వెల్లడించారు. ఐటిడిఎల పరిధిలోని 236 ఆమ్లెట్ గ్రామాల రోడ్ల నిర్మాణానికి ఎస్‌టి సబ్‌ప్లాన్ ద్వారా నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. వీటన్నింటికీ త్వరలోనే టెండర్లు పిలుస్తామని చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం గిరిజన తండాలను గాలికి వదిలేసిందని విమర్శించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్కకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఎమ్మెల్సీ కవిత పరోక్షంగా అంగీకరించారని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 2014కు ముందు కెసిఆర్ కుటుంబానికి ఉన్న ఆస్తులు ఎన్ని? 2023 తర్వాత పెరిగిన ఆస్తి ఎక్కడి నుంచో వచ్చిందో అందరికీ తెలుసని వివరించారు. కాళేశ్వరంతోపాటు మిషన్ భగీరథ, మిషన్‌కాకతీయల్లోనూ భారీ అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కక్ష సాధింపులకు పాల్పడబోదని చెప్పారు. హరీశ్‌రావు, సంతోశ్‌రావుల వెనుక కాంగ్రెస్ ఉందనే ఆరోపణల్లో నిజం లేదని కొట్టి పారేశారు. వారి కుటుంబ తగాదాలను పరిష్కరించుకోలేక మరొకరిపై నిందవేయడం తగదని హితవు పలికారు.

వరదలో గల్లంతైన వ్యక్తి కుటుంబానికి రూ.ఐదు లక్షల సాయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎగువ మానేరు ప్రాజెక్టు వద్ద వాగు దాటుతూ గల్లంతైన వ్యక్తి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి మంగళవారం రూ.ఐదు లక్షల చెక్కును రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అందజేశారు. వరదల్లో పశువులను కోల్పోయిన రైతులకూ పరిహారం చెక్కులు పంపిణీ చేశారు. గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన పంపుకాడి నాగయ్య మానేరు వాగు దాటుతుండగా ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. ఐదు ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఆయన ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో నాగయ్య భార్య లక్ష్మికి రూ. ఐదు లక్షల చెక్కును కలెక్టర్ అందజేశారు. వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

పశువుల యజమానులకు పరిహారం

లింగన్నపేట గ్రామానికి చెందిన గడ్డమీది మణెమ్మకు చెందిన రెండు పశువులు, ప్రవీణ్‌గౌడ్‌కు చెందిన పశువు వరదల్లో కొట్టుకుపోయాయి. దీంతో వారికి ప్రభుత్వం తరపున నష్టపరిహారం చెక్కులను అందజేశారు. మణెమ్మకు రూ.లక్ష, ప్రవీణ్‌గౌడ్‌కు రూ.50 వేల చెక్కులను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విజయ, సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, తాసిల్దార్, ఎంపిడిఒ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు చెక్కును అందిస్తున్న అధికారులు

కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించిన సీత దయాకర్ రెడ్డి

ప్రజాశక్తి- కల్చరల్

చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయంను మంగళవారం బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ సీత దయాకర్ రెడ్డి సందర్శించారు. గ్రంథాలయంలో బాలలకు సంబంధించిన పుస్తకాలు వారికి తగిన వసతుల గురించి తెలుసుకున్నారు. పోటీ పరీక్షలకు హాజరుకు సంసిద్ధులు అవుతున్న విద్యార్థులకి అందులైన వారి కోసం ఏర్పాటు చేసిన బ్రెయిలీ విభాగంను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరి పద్మజ శాలువాతో సీతా దయాకర్ రెడ్డి సత్కరించారు. హక్కుల కమిషన్ సభ్యులు గోగుల సరిత ప్రేమలత అగర్వాల్ బి వచన కుమార్ కూడా చైర్ పర్సన్ వెంట ఉన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు చంద్ర కళ సీతా మహా లక్ష్మీ ఉద్యోగులు అవినాష్ వెంకటేశ్వర రెడ్డి వెంకటేష్ యాదవ్ బొల్లం మహేంద్ర, కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండో వారంలో పాఠశాల క్రీడలు

- నవీన్ నికోలస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఈ నెల రెండో వారంలో మండల, జిల్లా స్థాయిలో పాఠశాలల క్రీడలను నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈ నవీన్ నికోలస్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యాసంవత్సరంలో పాఠశాలల్లో క్రీడలను నిర్వహించాలని తెలిపారు. మౌలిక వసతులున్న జిల్లాల్లో సాంకేతిక క్రీడలను నిర్వహించాలని కోరారు. అండర్ 14, 17, 19 ఏండ్ల విద్యార్థులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) నిర్వహిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో ఈ నెల నాలుగో వారంలో క్రీడలను నిర్వహించాలని సూచించారు. వచ్చేనెల ఆరో తేదీ నుంచి జాతీయ స్థాయి క్రీడలను నిర్వహిస్తామని తెలిపారు.

వామన్‌రావు దంపతుల హత్య కేసులో సిబిఐ ఎంట్రీ

- తెరపైకి కొత్త కోణాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంచలనం సృష్టించిన న్యాయవాద దంపతులు గట్టు వామన్‌రావు, నాగమణి హత్య కేసును కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) విచారణ చేపట్టింది. దాంతో ఈ కేసులో ప్రభావంతంగా ఉన్న వారిలో అలజడి మొదలైంది. రాజకీయంగా శక్తివంతమైన మంథని నియోజకవర్గం మరోసారి వార్తల్లోకి ఎక్కింది. వామనరావు దంపతుల హత్య కేసులో కీలక పాత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మంథని నేతలకు ప్రస్తుతం కంటి మీద కునుకు కరువైంది. ఈ కేసులో కీలక ఆధారాలు బయటకు వచ్చే అవకాశాలున్నాయని, ఇప్పటి వరకు తెరవెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరో కూడా వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వామన్‌రావు హత్య కేసును సిబిఐ విచారణ చేపట్టింది. 2021 ఫిబ్రవరి 17న పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కాల్వచర్ల వద్ద నడి రోడ్డుపై న్యాయవాద దంపతులు వామన్‌రావు, నాగమణిని అత్యంత దారుణంగా నరికి చంపిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రధాన నిందితులతోపాటు ఏడుగురిని అరెస్టు చేసి జైలుకు పంపించారు. అయితే, ఈ కేసులో రాజకీయ ప్రభావం ఉన్నట్టుగా ఆరోపణలు రావడంతో వామన్‌రావు తండ్రి గట్టు కిషన్‌రావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేసు దర్యాప్తును సిబిఐకి అప్పగించాలని కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఈ కేసును స్వీకరించి దర్యాప్తు ప్రారంభించింది. ఇన్‌స్పెక్టర్ విపిన్ గహలోత్ ఆధ్వర్యంలో దర్యాప్తు బృందం పాత నిందితులైన వెల్ది వసంతరావు, కుంట శ్రీనివాస్, అక్కపాక కుమార్‌పై రీ రిజిస్టర్ చేసి విచారణ చేపట్టింది. అయితే, పాత నిందితులను మళ్లీ అరెస్టు చేయకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

మంథనితో మరో కనెక్షన్

వామన్‌రావు హత్యకేసే కాకుండా, మంథని నియోజకవర్గంతో సంబంధం ఉన్న మరో ప్రధాన కేసు కూడా సిబిఐకి అప్పగించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సిబిఐ విచారణకు ఆదేశిస్తూ ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టులోని అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీలు మంథని నియోజకవర్గంలోనే ఉన్నాయి.

సిబిఐ చొచ్చుకొస్తే..

గత ప్రభుత్వం సిబిఐ రాకుండా నిషేధం విధించగా, ప్రస్తుత ప్రభుత్వం ఆ నిషేధ ఉత్తర్వులను ఉపసంహరించుకుని, రెండు కీలక కేసులను సిబిఐకి అప్పగించడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. మంథని నియోజకవర్గం నుంచి ఈ రెండు కేసులు సిబిఐ దర్యాప్తులో ఉండటంతో, రానున్న రోజుల్లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయోనని ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు. న్యాయవాద దంపతుల హత్య కేసులో ప్రధాన నిందితులుగా ఉన్నవారికి ఇప్పటి వరకు కొందరు 'పెద్దల' అండదండలున్నాయని ఆరోపణలు ఉన్నాయి. సిబిఐ దర్యాప్తు చేపట్టిన నేపథ్యంలో ఈ హత్యల వెనుక ఉన్న అసలు శక్తి ఎవరో తెలుస్తుందని భావిస్తున్నారు. ఈ రెండు కేసుల ఫలితాలతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల సమయానికి మంథని సహా పెద్దపల్లి జిల్లా రాజకీయ ముఖచిత్రం మారే అవకాశాలున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

- పాల్వాయి హరీశ్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం రూ.1300 కోట్ల ఆరోగ్య శ్రీ పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని బిజెపి ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డి తెలంగాణను ఒక ట్రిలియన్ ఎకానమీగా మార్చుతామని చెబుతున్నారని, ఆరోగ్యం అందులో భాగమా? కాదా? అని ప్రశ్నించారు. ఒక అంచనా ప్రకారం తెలంగాణలో 80శాతం మంది రోగులు ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారనీ, 20 శాతం మందే ప్రభుత్వాస్పత్రులకు వెళున్నారని చెప్పారు. ప్రభుత్వాస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడం, ప్రాణాలకు గ్యారెంటీ లేకపోవడం వల్లనే ఈ పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఎంతమంది పేదలు రూ. 5 లక్షల నుంచి 10 లక్షల వైద్యాన్ని పొందారో చెప్పాలని నిలదీస్తే సర్కారు వద్ద సమాధానమే లేదని విమర్శించారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో 100 పడకల ఏర్పాటు హామీ నీటిమీది రాతలా మారిందన్నారు. ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన, ఆయుష్మాన్ భారత్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నదని ఆరోపించారు.